అన్ని డివిజన్లలో డ్రైనేజీ, తాగునీటి పనులు

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

రత్నానగర్‌లో తాగునీటి పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ అమృత

అంబర్‌పేట, జనవరి 24 : అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులు చేపట్టామని, ఇంకా మిగిలి ఉన్న ప్రాంతాల్లో పనులు చేపట్టి పూర్తి చేస్తామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. బుధవారం నల్లకుంట డివిజన్ రత్నానగర్‌లో రూ.7 లక్షలతో నూతనంగా చేపట్టిన మంచినీటి పైప్‌లైన్ పనుల ను స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గం లోని అన్ని డివిజన్లలో నూతనంగా డ్రైనేజీ, మంచినీటి పైప్ లైన్ పనులు చేపట్టామని తెలిపారు. లోప్రెషర్, కలుషిత తాగునీరు సరఫరా జరుగుతుందో అక్కడ నూతన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశామన్నారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

బాలికలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టాలి

చిక్కడపల్లి/అబిడ్స్, జనవరి24 : బాలికలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టే దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అంబేద్కర్ లా కళాశాల ప్రిన్సిపాల్ సృజన అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యాసంస్థ, ఎన్‌సీసీ 1,2,3ల ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సృజన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రిషికాంత్, ప్రిన్సిపాల్ భవానీ, స్కూల్ ప్రిన్సిపాల్ విఠలాచారి, డాక్టర్ విజేందర్,డాక్టర్ శ్రీధర్,కుమారస్వామి, మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

అబిడ్స్‌లో...

మార్గదర్శిని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. శ్రీసావిత్రి కన్యా పాఠశాల విద్యార్థినులతో పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మార్గదర్శిని వ్యవస్థాపక అధ్యక్షురాలు అరుణజ్యోతి, బేగంబజార్ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీతాలత పాల్గొన్నారు.

అదేవిధంగా రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో గోషాకట్ హై స్కూల్‌లో బుధవారం బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. స్రవంతి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

'స్వామి వివేకానంద సొసైటీ ఫర్ రూరల్, అర్బన్ డెవలప్‌మెంట్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఎమ్మెల్సీ మహేశ్ గౌడ్, రాష్ట్ర టీపీసీసీ దీపాదాస్ మున్షీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు కొడిమల మహేందర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

–చిక్కడపల్లి,జనవరి24

మెగా జాబ్ మేళా



నిరుద్యోగులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. బుధవారం నాంపల్లి నియోజకవర్గం, మాసాబ్ ట్యాంక్ ఖాజా మాన్షన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను నిర్వాహకులు మన్నాన్ ఖాన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారికి జాబ్ ఆఫర్ లెటర్‌లను అందజేశారు. – మెహిదీపట్నం జనవరి 24

మహంకాళి ఆలయ అభివృద్ధికి విరాళం

అలయ అభివృద్ధికి రూ. 50 వేలను ముఠా జయసింహ చేతుల మీదుగా అందజేస్తున్న అనీష్ గంగపుత్ర

కవాడిగూడ, జనవరి 24: నారాయణగూడకు చెందిన స్వర్గీయ సత్తయ్య, యశోదమ్మల జ్ఞాపకార్థకంగా బోలక్‌పూర్ డివిజన్‌లోని శ్రీ మహంకాళి అమ్మవారి అలయ అభివృద్ధికి హిమాయత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నేత అనీష్ గంగపుత్ర రూ. 50వేలను అందజేశారు. ఈ మేరకు బుధవారం బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ చేతుల మీదుగా గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడు బైరు నాగేందర్‌కు ఆలయ ప్రాంగణంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బైరు బాబురావు, కొండల్, బైరు గోవింద్ రాజ్, అభిషేక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

వైద్య శిబిరంలో కార్పొరేటర్ ఉమ, డీపీఎంఓ డాక్టర్ పద్మజ, తదితరులు

కాచిగూడ,జనవరి 24: పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమారమేశ్‌యాదవ్ అన్నారు. ముక్త్ భారత్‌లో భాగంగా బుధవారం కాచిగూడ జూనియర్ కళాశాలలో 16 నుంచి 18 సంవత్సరాల విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.అనంతరం డీపీఎంఓ డాక్టర్ పద్మజ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ బీమా పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, డాక్టర్లు రామలక్ష్మి, రమేశ్, రమ, కృష్ణకుమార్, సుభాశ్‌పటేల్, క్షీరసాగర్, భీంరాజ్, రవియాదవ్, మల్లికార్జున్, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

రవీంద్రభారతి, జనవరి 24: ప్రజాయుద్ధ నౌక గద్దర్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని, గద్దర్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించాలని తెలంగాణ రాష్ట్ర మాలమహానాడు ఫౌండేషన్ చైర్మన్ వెన్న సదానంద్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని, ఆయన సేవలను ప్రభుత్వం గుర్తించాలని సదానంద్ డిమాండ్ చేశారు.

వాయిద్యకారుడు సత్యదేవ్‌కు సత్కారం

ముషీరాబాద్, జనవరి 24: రాగరాగిణి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ప్రముఖ కీబోర్డు వాయిద్యకారుడు బీఎస్ సత్యదేవ్‌కు ఆత్మీయ సత్కార సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త వోలేటి పార్వతీశం ముఖ్య అతిథిగా పాల్గొని సత్యదేవ్‌ను ఘనంగా సత్కరించారు. అంతకుముందు రాగరాగిణి భక్త బృందంచే భక్తి గీతాలాపన పలువురిని విశేషంగా అలరించింది. ఈ కార్యక్రమంలో సీహెచ్ త్రినాథరావు, రాగరాగిణి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎంవీ రమణకుమారి, ప్రధాన కార్యదర్శి ఎంవీ సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ఉత్తమ వైద్య సేవలు అందించాలి

మెహిదీపట్నం సరోజినిదేవి కంటి ఆస్పత్రిలో ఆధునీకకరించిన సూపరింటెండెంట్ కార్యాలయాన్ని బుధవారం మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్(డీఎంఈ) డాక్టర్ త్రివేణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజలింగం, ఆర్ఎంఓలు డాక్టర్ నజాఫీ బేగం, డాక్టర్ విమల, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంఈ మాట్లాడుతూ.. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే కంటి రోగులకు ఉత్తమ వైద్య సేవలు అందించా లని సూచించారు.

– మెహిదీపట్నం జనవరి 24

క్రీడాకారులకు సన్మానం

చెన్నైలో జనవరి 25 నుంచి 31వరకు జరగనున్న ఖేలో ఇండియా పోటీలకు కార్వాన్ నియోజకవర్గం నుంచి ఎంపికైన క్రీడాకారులు ఎండి షోయబ్ ,జె.కార్తిక్ రాజ్ సింగ్, కె.గజరాజ్ సింగ్‌లను ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ బుధవారం టోలీచౌకిలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్, ఎంఐఎం నాయకులు కాలియా పహిల్వాన్, ఫరూఖ్, తదితరులు పాల్గొన్నారు. – మెహిదీపట్నం జనవరి 24

సహస్రార్జున్ మహారాజ్ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం

శ్రీ రాజరాజేశ్వర సహస్రార్జున మహారాజ్ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సమాజ్ ప్రతినిధులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాజ్ విగ్రహానికి పంచామృత అభిషేకం, యజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టి మూడు రోజుల పాటు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సమాజ్ అధ్యక్షుడు నగరి లక్ష్మీనారాయణ్, ప్రధాన కార్యదర్శి కాటిగర్ శంకర్‌రావు, కోశాధికారి శివరతన్, మ్యాక్స్ సొసైటీ డైరెక్టర్ తిర్మాలి జై ప్రకాశ్,అజయ్ చవాన్, నగరి సురేందర్, అశోక్, మీడియా చైర్మన్ కుమార్, మాజీ అధ్యక్షుడు రతన్ రాజేంద్ర, యశ్వంత్ చవాన్, గంభీర్ నాగరాజ్, శృతివెంకటేశ్, గోరక్ జగదీశ్, విద్య, మహిళా అధ్యక్షురాలు రాజ్‌కుమారి చవాన్, కల్పన, మంజు, దీప, సరస్వతి, కవత్, కళావతి, రాణి, మంజు పాల్గొన్నారు. – అబిడ్స్, జనవరి 24

విద్యార్థులకు రచన, రంగోలి పోటీలు

సుల్తాన్‌బజార్,జనవరి 24. విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు పలు సామాజిక అంశాలపై పోటీలు నిర్వహించి.. వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకుగాను కృషి చేస్తున్నట్లు సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు.ఈ మేరకు బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాల ఆవరణలో గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, రంగోలి పోటీలు నిర్వహించారు. ఆయన పోటీలను తిలకించి పర్యవేక్షించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో నిర్వహిస్తున్న అన్ని పోటీల్లో విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, డాక్టర్ చాయ, పలు విభాగాల అధిపతులు, కోఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మాజీ కార్పొరేటర్



మాజీ కార్పొరేటర్ రవీందర్‌కు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ లక్ష్మణ్

కవాడిగూడ, జనవరి 24: కవాడిగూడకు చెందిన మాజీ కార్పొరేటర్ టి. రవీందర్ బీజేపీలో చేరారు. బుధవారం ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ సమక్షంలో ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం రవీందర్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని బీజేపీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేశ్, శ్రీనివాస్ యాదవ్, కవాడిగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ గంగపుత్ర, శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎలహంక రైల్లో చోరీ

కాచిగూడ, జనవరి 24: ఎలహంక రైల్లో చోరీ జరిగింది. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ, అనంతపురం ప్రాంతానికి చెందిన కృష్ణ మూర్తి కుమారుడు శివప్రసాద్(48) అనంతపురం రైల్వేస్టేషన్‌లో ఎలహంక రైల్లో కాచిగూడకు వస్తున్నాడు. మార్గమధ్య గుంతకల్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు అతడి జేబులోనుంచి రూ. 30 వేల నగదు, పాన్, ఆధార్‌కార్డును దొంగిలించారు.

బుధవారం రాత్రి శివప్రసాద్ కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని.. విచారణ నిమిత్తం గుంతకల్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ బీజీ ప్రసాద్‌రావు తెలిపారు.

గృహిణి అదృశ్యం

సుల్తాన్‌బజార్,జనవరి 24 : ఓ గృహిణి అదృశ్యమైంది. ఈ సంఘటన బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా, దుండిగల్ తండా-2 ప్రాంతానికి చెందిన నేనావత్ రంజిత్‌కు 9 ఏండ్ల క్రితం కీర్తి(25)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా.. దంపతుల మధ్య గొడవలతో కీర్తి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆ తర్వాత తిరిగి వచ్చింది. నాంపల్లిలో అద్దెకు ఉంటున్న ప్రాంతం నుంచి సామగ్రిని తీసుకురావడానికి.. ఈ నెల 20న కీర్తి, మరో వ్యక్తితో కలిసి రంజిత్ ఆటోలో వెళ్లారు. అక్కడికి వెళ్లిన తర్వాత కీర్తి బయటకు వెళ్లి, ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది. పరిసర ప్రాంతాల్లో గాలించినా, బంధువులను అడిగినా ఇప్పటి వరకు ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మెహిదీపట్నం బీజేపీ నేత ఆకస్మిక మృతి

మెహిదీపట్నం జనవరి 24 : మెహిదీపట్నం డివిజన్ బీజేపీ నేత దేవరశెట్టి గోపాలకృష్ణ బుధవారం ఆకస్మికంగా మృతిచెందారు. ఈయన మెహిదీపట్నం అయోధ్యనగర్‌లో నివసించేవారు. ఈయన అంత్యక్రియలు గురువారం దర్గా వద్ద జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇతనికి భార్య, కూతురు ఉన్నారు.

సోలార్ ప్రాముఖ్యతపై అవగాహన

సౌరశక్తి పితామహుడు ప్రొఫెసర్ సోలంకిని సన్మానిస్తున్న డైమండ్ జూబ్లీ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత గడే

అబిడ్స్, జనవరి 24 : ముంబై ఐఐటీ ప్రొఫెసర్ సోలంకి ఎనర్జీ స్వరాజ్ యాత్ర బుధవారం నాంపల్లిలోని డైమండ్ జూబ్లీ ఉన్నత పాఠశాలకు చేరింది. ఈ సందర్భంగా ఆయన దేశమంతటా కార్బన్ వాడకాన్ని తగ్గిస్తూ సోలార్ ప్రాముఖ్యతను వివరించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ సోలంకి మాట్లాడుతూ.. ఆగాఖాన్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఎనిమిది పాఠశాలలు, 33 ప్రీ ప్రైమరీ పాఠశాలలు, 15 సర్వ శిక్షా అభియాన్ కేంద్రాలను తెలంగాణ, గుజరాత్‌లలో నిర్వహిస్తూ 70 వేల మంది విద్యార్థులను ఆదర్శంగా తీర్చి దిద్దుతోందన్నారు. గ్లోరియా డిసొజా అంతర్జాతీయంగా ఇచ్చే బెస్ట్ ఎడ్యుకేటర్ 2021 అవార్డును ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత గడే అందుకోవడం ప్రశంసనీయమన్నారు. అనంతరం ప్రొఫెసర్ సోలంకిని ప్రిన్సిపాల్ సుజాత గడే సన్మానించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఫైర్‌సేఫ్టీ కోర్సుల శిక్షణకు దరఖాస్తులు

కాచిగూడ, జనవరి 24: నేషనల్ సెంటర్ ఫైర్‌సేఫ్టీ, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఫైర్‌సేఫ్టీ కోర్సులకు అర్హత గల అభ్యర్థుల నుంచి తెలంగాణ వ్యాప్తంగా దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు పేరొందిన ఎయిర్‌పోర్టు, ఆయిల్ కంపెనీలు, గ్యాస్ ఇండస్ట్రీస్, స్టార్ హోటల్స్, ఫార్మా ఇండస్ట్రీస్, రైల్వే సంస్థల్లో అవకాశాలు పొందవచ్చని వెల్లడించారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ అభ్యరులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల యువకులు వచ్చే నెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు www. nettindia. com లేదా 9701496748 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ

గోల్నాక, జనవరి 24 : సెంట్రల్ ఫర్ సివిల్ సొసైటీ న్యూఢిల్లీ, నిసా, బోలో ఇంగ్లీష్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు స్కూళ్ల యాజామాన్యాల సంఘం (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షుడు సాధుల మధుసూదన్, ప్రధాన కార్యదర్శి రమేశ్, కోశాధికారి పి.రాఘవేంద్రరెడ్డి బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

ట్రస్మా బడ్జెట్ పాఠశాలల అభివృద్ధి చెందే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు వారు పేర్కొన్నారు. ఫిబ్రవరి నుంచి ప్రారంభమవుతున్న శిక్షణ తరగతులు వారానికి మూడు రోజుల పాటు నాలుగు గంటలు ఆన్‌లైన్‌లో శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులకు ఇంగ్లిష్ రీడింగ్, స్పీకింగ్, రైటింగ్ నైపుణ్యాలపై శిక్షణ ఇస్తామని ఆయన పేర్కొన్నారు. రిజస్ట్రేషన్లకు ఈనెల 26వరకు తమ తమ పాఠశాలల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

బీసీలకు 56శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం

● ఫిబ్రవరి 5,6న చలో ఢిల్లీ ● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

వేదికపై నుంచి అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, బీసీ నేతలు గుజ్జ కృష్ణ

రవీంద్రభారతి,జనవరి 24: చట్టసభలో బీసీలకు 56శాతం రిజర్వేషన్లకై పోరాటాలు తీవ్రతరం చేస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు . పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలో బీసీలకు 56 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి5,6 తేదీల్లో పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహిస్తామని, ఈ ఉద్యమ కార్యక్రమంలో ప్రతి బీసీ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం నిర్వహించిన కార్యక్రమానికి ఆర్.కృష్ణయ్య పాల్గొని గవ్వల భరత్‌కుమార్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ వింగ్ అధ్యక్షుడిగా నియమించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ బిల్లుకు మద్దతు ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలను కోరుతూ కేంద్ర ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో 2లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు.76 ఏండ్లుగా బీసీలకు అన్యా యం జరుగుతూనే ఉందని, బీసీలకు రావాల్సిన వాటా ఇచ్చే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వి.హనుమంత్‌రావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జకృష్ణ,రాజేందర్, అంజి, జయంత్‌గౌడ్, రత్‌గౌడ్, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

మల్లు రవికి సన్మానం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి దేశ రాజధాని న్యూ ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైన డాక్టర్ మల్లు రవిని బుధవారం సన్మానిస్తున్న తెలంగాణ రాష్ట్ర మేరు యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొల్కం శ్రీనివాస్

– అబిడ్స్, జనవరి 24

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

సుల్తాన్‌బజార్, జనవరి 24. ఇందిరాప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికిగాను మూడు పోస్టులకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీషు-1, కంప్యూటర్-1, బీబీఏ ఈ కామర్స్ విభాగంలో-1 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తునున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 15లోగా నాంపల్లిలోని ఇందిరాప్రియ దర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ క ళాశాలలో దరఖాస్తులను నేరుగా సమర్పించాలని, అదే విధంగా 29న ఇంటర్వ్యూలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

వృద్ధుడు మృతి

కాచిగూడ, జనవరి 24: అనారోగ్యం తో ఓ వృద్ధు డు మృతి చెందాడు. ఈ సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరి గింది. ఎస్సై సుభాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కె.మనోహర్‌రెడ్డి(75) కాచిగూడ త్రివేణి లాడ్జిలో గత తొమ్మిది నెలల నుంచి అద్దెకు ఉంటున్నాడు. గత కొంతకాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడు తుండగా లాడ్జి సిబ్బంది గాంధీ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ మనోహర్‌రెడ్డి బుధవారం మృతిచెందారు. మనోహర్‌రెడ్డి కుటుంబసభ్యులు, సంబంధీకులు 8712660542 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.